క్లుప్తంగా

18, 19 తేదీల్లో వార్షికోత్సవం

తెనాలి: పట్టణ రామలింగేశ్వరపేటలోని సద్గురు సాయినాథుని సత్సంగ కేంద్రం 33వ వార్షికోత్సవం ఈనెల 18, 19 తేదీల్లో వైభవంగా జరగనుంది. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని టీజీకే కల్యాణ మండపంలో జరిగే ఈ వేడుకల వివరాలను కన్వీనర్ వీఎస్ నాగభూషణరెడ్డి బుధవారం సాయంత్రం తెలియజేశారు. తొలి రోజున 18వ తేదీ సాయంత్రం సత్సంగ కేంద్రం నుండి సాయినాథుని హంస వాహనంపై ఊరేగింపుగా తెనాలి పురవీధుల్లో నగరాయణం చేయించి, రాత్రి తొమ్మిది గంటలకు టీజీకే కల్యాణ మండపంలో విడిది చేయిస్తారు. ఉత్సవ సత్సంగమూర్తులకు హారతి, ప్రసాద వినిమయం, 9.30 గంటలకు బాబా, గురుదేవులకు లెండివనంలో విశ్రాంతి ఉంటాయి. 19వ తేదీన ఉదయం ఏడు గంటలకు భాబా భజనతో కార్యక్రమాలను ప్రారంభిస్తారు. సామూహికంగా సాయిసచ్చరిత్ర పారాయణ, షిరిడీ సాయిబాబు కథా నృత్యగీతిక, లెండి వనంలో బాబా గురువులకు మధ్యాహ్న ఆరతి ఉంటాయి. మధ్యాహ్నం రెండు గంటలకు కూచిపూడి నృత్యం, 3 గంటలకు బ్రహ్మశ్రీ నోరి నారాయణమూర్తిచే శ్రీసాయి సచ్చరిత్ర నుంచి సత్సంగ ప్రవచనం ఉంటాయని వివరించారు.

వైభవంగా పట్టాభి రాముడి ఊరేగింపు



తెనాలి: పట్టణ బాలాజీరావుపేటలోని శ్రీపట్టాభి రామస్వామి దేవస్థానంలో సంక్రాంతి పర్వదిన వేడుకల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామివారి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. వార్డు కౌన్సిలరు పేరం సంజీవ రెడ్డి, వరలక్ష్మి గాయత్రి ఆధ్వర్యంలో పురవీధుల్లో సాగిన ఊరేగింపులో ఆలయ పూజారి నాగమూరుతి, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా చెన్నకేశవస్వామి గ్రామోత్సవం

నగరం: కనుమ పండగ పురస్కరించుకుని మండలంలోని పెదపల్లి గ్రామంలో చెన్నకేశవ స్వామి గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వాహనంపై ఉంచి గ్రామంలోని పురవీధులలో ఊరేగించారు. దారిపొడవునా భక్తులు స్వామి వారికి తమ శక్తి కొలది పూజా సామగ్రి అందించి విశేషపూజలు చేశారు. ప్రతి ఏటా కనుమ పండగ రోజు స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామోత్సవం అనంతరం తెప్పోత్సవం చేసి మరలా ఉత్సవ విగ్రహాలను ఆలయంలో ప్రవేశపెట్టనున్నట్లు తెలియజేశారు.

కోడి పందేల నిర్వాహకుల అరెస్ట్

రేపల్లె రూరల్: కోడి పందేలు నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న ఘటన బుధవారం పేటేరు గ్రామంలో చోటు చేసుకుంది. సీఐ మల్లికార్జునరావు వివరాల మేరకు మండలంలోని పేటేరు గ్రామంలో కోడి పందెలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో సిబ్బందితో కలసి దాడులు నిర్వహించామన్నారు. దాడులలో పేటేరు గ్రామ శివారులో కోడి పందేలు ఆడుతూ ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారన్నారు. వీరి వద్ద నుంచి రెండు కోడి పుంజులు, రూ.1,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. దాడులలో ఎస్‌ఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు ఢీ కొని మహిళ మృతి

చందోలు(కర్లపాలెం): ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీ కొని ఓ మహిళ మృతి చెందిన ఘటన పిట్టలవానిపాలెం మండలంలోని అలకాపురం గ్రామం వద్ద చోటు చేసుకుంది. చందోలు ఎస్‌ఐ ఆర్.స్వామిశ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు నిజాంపట్నం గ్రామానికి చెందిన మోపిదేవి వెంకటేశ్వరమ్మ(56) తన చెల్లెలి కుమారుడి ద్విచక్ర వాహనంపై నిజాంపట్నం నుంచి చీరాల వస్తుండగా అలకాపురం దాటిన తరువాత నిజాంపట్నం నుంచి వెనుకగా వస్తున్న ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనటంతో వెంకటేశ్వరమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రురాలిని బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

కొల్లూరు: కూల్ డ్రింక్ అనుకొని పురుగుల మందు తాగిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు మండలంలోని దోనేపూడి శివారు కోటిపల్లికి చెందిన కేసర శ్రీనివాసరావు (60) ఈ నెల 13న కూల్ డ్రింక్‌గా భ్రమించి సీసాలో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన తెనాలి వైద్యశాలకు తరలించగా, పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు వైద్యశాలకు తరలించారు. మంగళవారం రాత్రి పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వైద్యశాల నుంచి అందిన నివేదిక ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జి.ఏడుకొండలు తెలిపారు.

వాడవాడలా సంప్రదాయబద్ధంగా సంక్రాంతి వేడుకలు

- సుదూరాల నుంచి తరలివచ్చిన బంధుగణం
- ముత్యాల ముగ్గులతో తెలుగు లోగిళ్లు కళకళ



మకర జ్యోతిని వెలిగిస్తున్న విశ్రాంత న్యాయమూర్తి గ్రంథి గోపాలకృష్ణమూర్తి

తెనాలి: తెలుగువారి సంప్రదాయ పండుగ సంక్రాంతి వేడుకలను పట్టణ, పరిసరాల్లోని ప్రజలు ఎంతో ఘనంగా జరుపుకున్నారు. తెలుగు పండుగల్లో సంక్రాంతి పండుగ ప్రత్యేకతే వేరు. ఎక్కడెక్కడ ఉంటున్న కుటుంబ సభ్యులు, బంధుమిత్రులంతా ఇంటికి చేరారు. సంక్రాంతి అంటేనే నూతన క్రాంతి అని తెలిసిందే. అందరూ పెద్ద పండుగగా భావించే సంక్రాంతి రోజున మహిళందరూ తెల్లవారుజామునే వాకిళ్ల ముందు రంగవల్లులు తీర్చిదిద్ది సంక్రాంతి లక్ష్మికి స్వాగతం పలికారు. పండుగ వేళ గంగిరెద్దుల కీర్తనలు, హరిదాసుల విన్యాసాలతో గతమంత ఆర్భాటం లేకున్నా వీధుల్లో సందడి చేశారు. మామిడి తోరణాలతో, పసుపు, కుంకుమలతో, ముత్యాల ముగ్గులతో లోగిళ్లన్నీ కళకళలాడాయి. ఊర్ల నుండి వచ్చిన బంధు మిత్రులతో ప్రతి ఇంటా కోలాహలం నెలకొంది. ఉదయాన్నే ఇళ్లలో పొంగళ్లు వండి పూజలు నిర్వహించుకున్న వారు దేవాలయాలను సందర్శించి ఇష్టదైవాలను దర్శించుకున్నారు. మకర సంక్రాంతిని పురస్కరించుకుని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొందరు గృహస్తులు తమ నివాసాల్లో బొమ్మలకొలువులను ఏర్పాటుచేశారు. మొత్తంమీద సంక్రాంతిని ప్రశాంతంగా జరుపుకున్నారు. తెనాలి మారీస్‌పేటలోని శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసివున్న శ్రీఅయ్యప్పస్వామి దేవాలయంలో మకర సంక్రాంతికి స్వామివారికి వివిధ రకాల అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అలంకరణ లు చేశారు. ఆలయంలో మకరజ్యోతిని ఏర్పాటు చేశారు చేయటం విశేషం. విశ్రాంత న్యాయమూర్తి గ్రంధి గోపాలకృష్ణమూర్తి దంపతులు పూజలు నిర్వహించిన తదుపరి గోపాలకృష్ణమూర్తి మకర జ్యోతిని వెలిగించారు. ఆలయ కమిటీ సభ్యులు అధ్యక్షులు గ్రంధి సేతుమాధవరావు, వరదా శేషగిరిరావు, పొన్నూరు నాగసూర్య శశి ధరరావు, తాడిపర్తి హరి, అంకరాజు పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు ఫణిశర్మ స్వామి పూజలు నిర్వహించారు. సభ్యులు భక్తులు పాల్గొన్నారు అయ్యప్ప శరణు ఘోషతో ఆలయ ప్రాంతం మారుమ్రోగింది తెనాలి పట్టణం అమరావతి కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ గోదా పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో ధనుర్మాస, వైకుంఠ ఏకాదశి,శ్రీ గోదా కళ్యాణోత్సవాలు సోమవారం రాత్రితో అత్యంత వైభవంగా ముగిశాయి. నెలరోజుల పాటు జరిగిన ఈ ఉత్సవాల్లో చివరి రోజు శ్రీగోదా రంగనాథస్వామి కళ్యాణ మహోత్సవం కనులపండువగా జరిగింది. స్వామివార్ల ఉత్సవంలో 11 మంది సువాసినులు పూజాకార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక్కడ నెల రోజుల పాటు స్వామి వారికి జరిగిన కైంకర్యాలను ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు తుమ్మల సత్యనారాయణ, కిక్కూరి చిన్న కృష్ణారెడ్డి, దేవాభక్తుని ఉమామహేశ్వరరావు, గడ్డిపాటి పుష్పకుమారి పర్యవేక్షించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకుని వెళ్లారు. తెనాలి పట్టణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా బోగి పండుగ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక మార్కెట్ సమీప గాడిబావి సెంటర్‌లోని సీతారామాంజనేయ స్వామి దేవస్థానం వద్ద సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన వేడుకలో ఆలయ అధికారులు, నాయీ బ్రాహ్మణ సేవా సంఘ నాయకులు పాల్గొన్నారు. సీతారామాంజనేయ స్వాముల వార్లకు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గత అనేక సంవత్సరాలుగా ఈ ఉత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు గుర్తుచేశారు. సంఘ అధ్యక్షుడు చందర్లపాటి సూర్య వెంకటేష్, కొడాలి సుబ్రహ్మణ్యం, గండికోట రాజా రమేష్, తాడివలస దామోదరరావు, లింగాల కోటేశ్వరరావు, కొడాలి మాణిక్యారావు, మున్నంగి సత్యం, మాచవరపు సుబ్రహ్మణ్యం, ఇంటూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. తెనాలి నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలను మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలియజేశారు. గంగానమ్మపేటలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకుడు అరవపల్లి సిరికృష్ణ రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. నియోజకవర్గ ప్రజలు ఈ సంక్రాంతి పండుగ వేడుకలను ఆనందోత్సవాలతో జరుపుకోవాలని కోరుకుంటూ పార్టీ నేతలతో కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. అరవపల్లి సిరి కష్ణ, అక్కిదాస్ కిరణ్ కుమార్, షేక్ దుబాయ్ బాబు, తట్టుకూళ్ల అశోక్ యాదవ్, యాతాటి అనిల్, కార్తీక్, బి.వేణుగోపాల్ రెడ్డి, సీహెచ్ కిషోర్ గౌడ్, వేణు కిట్టు, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

తూములూరులో...

తూములూరు(కొల్లిపర): సంక్రాంతిని పురస్కరించుకుని భారతీయతలో అంతర్భాగమైన ముగ్గుల అవశ్యతను తెలియజేసేందుకు ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు రాష్ట్ర ఆహార పౌరసరఫరాలశాఖామాత్యులు నాదెండ్ల మనోహర్ అన్నారు. మంగళవారం మండలంలోని తూములూరు గ్రామంలోని పాలకేంద్రం వద్ద కూటమి నాయకులు సంక్రాంతి వేడుకల్లో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్విహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి మనోహర్ పాల్గొని గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ ఉదయం ఇంటి వాకిలిలో వేసే ముగ్గువల్ల బ్యాక్టీరియా దరిచేరదన్నారు. పూర్వీకులు ఎంతో ముందు ఆలోచనతో ఈ సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ వస్తున్నారన్నారు. ముగ్గులు పోటీల్లో మొదటి బహుమతి లక్ష్మీ శ్రీసాయికి రూ.5 వేలు, రెండవ బహుమతి నాగశ్రావణికి రూ.3 వేలు, మూడవ బహుమతి వి.సుధ రూ.2 వేలు, నాలుగువ బహుమతి కీర్తిక కి రూ.1000 బహుమతులు అందజేశారు. మిగిలి వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయనిర్ణేతలుగా హేమలత, బసవమ్మ, కూటమి నాయకులు అడపా నారాయణరెడ్డి, కట్టా శ్రీహరి, కొండా కిషోరెడ్డి, నూలు వెంకటరామయ్య, ఏడుకొండలు, బద్దిగం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న మంత్రి మనోహర్

లంబాడా సంక్షేమ సంఘంచే ముగ్గుల పోటీలు

తెనాలి: సంక్రాంతి పండుగ సందర్భంగా జైసేవాలాల్ లంబాడా సంక్షేమ సేవాసంఘం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ముగ్గుల పోటీలను నిర్వహించారు. స్థానిక చినరావూరు రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన ఈ ముగ్గుల పోటీల్లో సంక్రాంతి పండుగ విశిష్టత, తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలు తెలియచేసేలా మహిళలు అందమైన రంగవల్లులను తీర్చిదిద్దారు. డాక్టర్ కె.వనజ, డాక్టర్ శిల్పా ముగ్గుల పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. సుమారు 70 మందికి పైగా మహిళలు ఈ ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో విజేతలతో పాటు పోటీల్లో పాల్గొన్న ప్రతీ ఒక్కరికీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జైసేవాలాల్ సేవాసంఘం అధ్యక్షుడు దారవత్ ప్రసాద్ నాయక్, తిరువూరు ప్రిన్సిపల్ జడ్జి మోతిలాల్ నాయక్, తండా నాయకులు కేతావత్ పరుశురాం నాయక్, సంఘ సభ్యులు, తండావాసులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



నూతన సంవత్సర క్యాలెండరును ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే శివకుమార్



రామలింగేశ్వరపేటలోని ఓ నివాసంలో బొమ్మల కొలువు ఇలా..



విజేతలకు బహుమతుల ప్రదానం చేస్తున్న దృశ్యం

కొలవరంలో...

తెనాలి: రూరల్ మండల గ్రామం కొలవరంలో అల్లూరి యువసేన (ఏవైఎస్) ఆధ్వర్యంలో బ్రహ్మంగారి ఆలయం వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, జ్ఞాపికలను పంపిణీ చేశారు.

ఆనందోత్సాహాలతో సాంస్కృతిక సంబరాలు

ఆట పాటలతో సందడి చేసిన చిన్నారులు

కొల్లిపర: శ్రీ కళా నిలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సాంస్కృతిక ప్రదర్శనలు ఆనందోత్సాహలతో సాగుతున్నాయి. స్థానిక అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాలలోని గాదె సుబ్బారెడ్డి కళావేదిక పై భీమవరపు తాతిరెడ్డి, గుదిబండి తిరుమలరెడ్డి స్మారక కళాప్రాంగణం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలు మంగళవారం రెండో రోజుకు చేరుకున్నాయి. సంబరాల్లో భాగంగా ఉదయం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 130 మంది మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ముగ్గులను అందంగా తీర్చిదిద్దారు. సాయంత్రం జరిగిన కార్యక్రమాలకి జొన్నల వెంకటసుబ్బారెడ్డి (థాయ్ లాండ్), గుదిబండి చిన వెంకటరెడ్డి, గుడిబండి సోమశేఖరరెడ్డి, ఉపసర్పంచ్ అవుతు కృష్ణారెడ్డిల సహకారంతో కూచిపూడి నృత్యం, జానపద నృత్య ప్రదర్శన, కోలాట ప్రదర్శనలు నిర్వహించారు. ఈ ప్రదర్శనలు మహిళలను, చిన్నారులను, ముఖ్యతను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం జరిగిన సభకు సభాఅధ్యక్షులుగా ఎఆర్ఆర్ జూనియర్ కాలేజీ ప్రెసిడెంట్ గుదిబంది చిన వెంకటరెడ్డి వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి మాట్లాడుతూ నేటి సమాజంలో అంతరించిపోతున్న సమంయంలో ఇలాంటి కార్యక్రమాలు చూసిన తరవాత ఐన మన సంస్కృతి గురించి యువత అర్థంచేసుకొంటారు అని తెలిపారు. ఎస్‌ఐ పి.కోటేశ్వరరావు మాట్లాడుతూ మన దేశ సంస్కృతి, ఆచారాలను ఇలాంటి ప్రోగ్రాం ద్వారా ప్రజలలోకి తీసుకు వెళుతున్న శ్రీ కళానిలయానికి నేటి యువత ఎంతో రుణపడి ఉంటుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ముందుముందు మరెన్నో చేయాలని కోరారు. అనంతరం కళానిలయం వారికి ప్రత్యేక అభినందనలు తెలిపి కళానిలయం సభ్యులు ఘనంగా సత్కరించారు. శ్రీ కళానిలయం అధ్యక్షుడు జొన్నల అమ్మిరెడ్డి మాట్లాడుతూ కళలను, కళాకారులను అంతరిస్తున్న సమయంలో అటువంటి వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో శ్రీ కళానిలయం ప్రతి సంవత్సరం సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2023-24 పదవ తరగతి విద్యార్థులకు గుదిబండి కృష్ణారెడ్డి స్మారక ప్రతిభా పురస్కారం క్రింద ప్రతిభా పురస్కారాలు అందజేశారు. మున్నంగి పూర్ణారెడ్డి స్మారక క్విజ్‌పోటీలు ద్వారా విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం స్థానిక వివేక మోడల్ - ఎఆర్ఆర్ జూనియర్ కాలేజీ విద్యార్థుల చేత ప్రత్యేక నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. తొలుత ఏఆర్ఆర్ జూనియర్ కాలేజీ ప్రెసిడెంట్ గుదిబంది చిన వెంకటరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం మొదలు పెట్టారు. అన్నపరెడ్డి శివరామిరెడ్డి స్మారక కళాప్రాంగణంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలు బుధవారం మూడువ రోజు (ముగింపు) చేరుకుంది.. సంబరాల్లో భాగంగా సాయంత్రం యాగప్రియ పాడుతా తీయగా ఫేమ్, రసూల్, పద్మశ్రీ, కృష్ణశ్రీ తదితరులు చేత పాడాలని ఉంది సినీ సంగీత విభావరి, అభినయ ఆర్ట్స్, గుంటూరు వారిచే ఇది అతని సంతకం (నాటిక)లు ప్రత్యేకంగా ప్రజలను ఆకట్టుకున్నాయి. ముగ్గు ల పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతయ స్థానంలో నిలిచిన మహిళలకు బహుమతులు అందజేసి మిగిలి వారికి ప్రోత్సాహం క్రింద వారికి కో బహుమతులు అందజేశారు.

తొలుత బొల్లిముంత కృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి నాటికలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళానిలయం అధ్యక్షుడు జొన్నల అమ్మిరెడ్డి, కార్యదర్శి బొమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోశాధికారి గుదిబండి మహేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షులు ఆరిమండ పెదనాగిరెడ్డి, సహాయకార్యదర్శి అన్నవరపు రమేష్, కార్యవర్గ సభ్యులు ఆరిమండ శివశంకరెడ్డి, భీమవరపు శివకోటి రెడ్డి, జొన్నల శ్రీనివాసరెడ్డి, ఉపసర్పొంచ్ అవుతు కృష్ణారెడ్డి, అరసం ఉపాధ్యక్షులు కె.బెన్‌హర్‌బాబు, మహిళలు, వివిధ గ్రామల ప్రజలు పాల్గొన్నారు.



ముగ్గుల పోటీలలో పాల్గొన్న మహిళలు



కూచిపూడి నృత్యం చేస్తున్న దృశ్యం



జానపద నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు



ప్రత్యేక నృత్యం చేస్తున్న చిన్నారి



ప్రతిభా పురస్కారం ద్వారా 2023-24 10 తరగతి విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తున్న దృశ్యం

విజయవాడ ధర్నాలో రైతులు పాల్గొనాలి

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి

తెనాలి: పంటలకు కనీస మద్దతు ధరల చట్టం చేయాలని కోరుతూ జనవరి 17న విజయవాడలో జరగనున్న ధర్నాలో రైతాంగం పాల్గొని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి కోరారు. పట్టణ చెంచుపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో బుధవారం సీఐటీయూ డివిజన్ కార్యదర్శి షేక్ హుస్సేన్‌వలితో కలిసి సాంబిరెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశవ్యాపితంగా రైతాంగం తాము పండించిన పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలనే డిమాండును కేంద్రప్రభుత్వం పట్టించుకోకపోవట దుర్మార్గమన్నారు. కేంద్రంప్రభుత్వం రద్దుచేసిన మూడు వ్యవసాయ నల్లచట్టాలను దొడ్డిదారిన అమలుచేస్తోందని ఆయన మండిపడ్డారు. గత 47 రోజులుగా జరుగుతున్న దల్లేవాల్‌సింగ్ నిరాహారదీక్షను పట్టించుకోకపోవటం, రైతుసంఘాలతో చర్చించక పోవడం కేంద్రప్రభుత్వ నిరంకుశ వైఖరికి అద్దంపడుతుందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను పగులగొట్టమని చెప్పిన చంద్రబాబు, లోకేష్‌లు, ఆదానీ స్మార్ట్ మీటర్లను బిగించే సన్నాహాల్లో ఉండటాన్ని ఏమనుకోవాలని సాంబిరెడ్డి ప్రశ్నించారు. జంపని-చినరావూరు మధ్య రైల్వేగేటును పునరుద్ధరించాలనీ, పెదవడ్లపూడి హైలెవెల్ ఛానల్ ఎత్తిపోతల పథకానికి నిధులు విడుదదల చేసి, 26 వేల ఎకరాలకు సాగునీరు అందించాలనే డిమాండ్లతో సహా ఈనెల 17న విజయవాడలో ధర్నా జరుగుతుందన్నారు. అక్కడ అలంకార్ సెటర్‌లో ఉదయం 10 గంటలకు జరిగే ధర్నాలో పాల్గొనాల్సిందిగా ఆయన రైతాంగాన్ని కోరారు.



మాట్లాడుతున్న శివసాంబిరెడ్డి

విద్యుత్ చార్జీల భారాన్ని ప్రభుత్వమే భరించాలి

భట్టిప్రోలు (కొల్లూరు): అదనపు విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై రుద్దకుండా ప్రభుత్వమే భరించాలని సీపీఐ వేమూరు నియోజకవర్గ కార్యదర్శి బండారు శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం భట్టిప్రోలులోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచమని హామీలు ఇచ్చి, నేడు ప్రజలను మోసం చేస్తూ సర్దుబాటు చార్జీల పేరుతో వినియోగదారులపై భారాన్ని మోపడం సమంజసం కాదన్నారు. ప్రస్తుతం వచ్చిన విద్యుత్ బిల్లులను పరిశీలిస్తే అసలు కంటే అదనపు చార్జీల భారం అధికంగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ట్రూ అప్ చార్జీలతో పాటు గత మూడేళ్ల పాటు ఎఫ్‌పీపీసీ చార్జీలను వసూలు చేస్తూ ప్రజలపై పెను భారాన్ని మోపడం అన్యాయమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు అదనపు విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు గొట్టుముక్కల బాలాజీ, ప్రజా సంఘాల నాయకులు వి.శ్రీనివాసరావు, కె.వీరమోహన్‌రావు, బి.యుగంధర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ఘనంగా కర్పూర జ్యోతి దర్శనం

చేబ్రోలు: సంక్రాంతి సందర్భంగా చేబ్రోలులోని చారిత్రిక ప్రసిద్ధి చెందిన నాగేశ్వరస్వామి దేవస్థానం వద్ద మంగళవారం రాత్రి కర్పూర జ్యోతి దర్శనాన్ని భక్తులు వీక్షించారు. సుమారు 50 కిలోల కర్పూరాన్ని అయ్యప్ప గురుస్వామి కర్పూర జ్యోతిని వెలిగించారు. దేవాలయంలోని అయ్యప్పస్వామి విగ్రహానికి విశేష పూజలు నిర్వహించారు. అయ్యప్ప భక్త బృందం ఆలపించిన పాటలు ఆకట్టుకున్నాయి. కర్పూర జ్యోతి దర్శన కార్యక్రమానికి చేబ్రోలు పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అయ్యప్పస్వాములు, భక్తులు తదితర భక్త బృందం చేపట్టిన జ్యోతి దర్శన కార్యక్రమం భక్తులకు కనువిందు చేశాయి. నాగేశ్వర స్వామి దేవస్థానంలో అర్చక బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఘనంగా నరసింహస్వామికి తెప్పోత్సవం

అల్లూరు(కర్లపాలెం): రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీ నరసింహస్వామి తెప్పోత్సవం కనుల పండువగా నిర్వహించారు. బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలం అల్లూరు గ్రామంలో వేంచేసియున్న రాజ్యలక్ష్మీ సమేత నరసింహస్వామి ధనుర్మాస మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం లక్ష్మీ నరసింహస్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన పడవపై ఉంచి విశేష అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం తెనాలి నిజాంపట్నం కాలువలో అల్లూరు శివారు రెడ్లపాలెం నుంచి పిట్టలవానిపాలెం సెంటర్ వరకు తెప్పోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తెప్పోత్సవానికి వచ్చి స్వామి వారిని తిలకించి భక్తి పారవశ్యంతో పులకించిపోయారు. స్వామి వారికి టెంకాయలు కొట్టి హారతులిచ్చారు.



కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



కొల్లూరు: అతివేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొని ద్విచక్ర వాహనదారుడు తీవ్ర గాయాలపాలైన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని క్రాపకు చెందిన తలశల రమేష్ తన ద్విచక్ర వాహనంపై కొల్లూరు వెళ్లేందుకు క్రాప నుంచి వస్తూ తెనాలి-రేపల్లె ప్రధాన మార్గంలోకి చేరుకున్నాడు. అదే సమయంలో తెనాలి వైపు నుంచి అతివేగంగా వస్తున్న ఇన్నోవా వాహనం వెనుక నుంచి రమేష్ ప్రయాణిస్తున్న వాహనాన్ని ఢీ కొట్టింది. ప్రమాదంలో కారు ఢీకొట్టిన వేగానికి రమేష్ గాలిలోకి ఎగిరి, కారు అద్దాలకు కొట్టుకుని కింద పడిపోవడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు క్షతగాత్రుడికి సపర్యలు చేసి 108 వాహనంలో తెనాలి వైద్యశాలకు తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ పరారవడంతో పోలీసులు వాహనాన్ని కొల్లూరు పోలీసు స్టేషన్‌కు తరలించారు.